ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



రంగారెడ్డి

5 జిల్లా వార్తలు

శనివారం 31 ఆగస్టు 2024

హైడ్రా పరిధిని విస్తరించండి



షాద్‌నగర్‌అర్బన్, ఆగస్టు 30: ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ కోసం ఏర్పాటు చేసిన హైడ్రాను హెచ్‌ఎండీఏ పరిధికి విస్తరించాలని షాద్‌నగర్ ఎమ్మెల్యే శంకర్ సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు. ఈ మేరకు శుక్రవారం ఆయన వినతి పత్రం అందజేశారు. హైడ్రా చర్యలపై ప్రజాస్పందన పెరుగుతుందన్నారు. షాద్‌నగర్ వరకుకు విస్తరించి, ప్రభుత్వ ఆస్తులను పరిరక్షించాలని కోరారు.



పెద్ద చెరువులో అధికారులు కూల్చివేసిన ప్రహరీ (ఫైల్)

బొమ్మరాశిపేటలో..

బొమ్మరాశిపేట పెద్ద చెరువు దాదాపు 129.5 ఎకరాల్లో విస్తరించి ఉంది. ఈ చెరువుకు సంబంధించిన సర్వేనం. 408లోని దాదాపు 6 ఎకరాల బఫర్ జోన్ పరిధిలోని భూమిని మాజీ మంత్రి మల్లారెడ్డి కొనుగోలు చేశాడు. కాగా ఈ భూమికి మల్లారెడ్డి చుట్టూ ప్రీ కాస్ట్ వాల్ నిర్మించగా ఈ ఏడాది మే నెలలో ఇరిగేషన్ శాఖ అధికారులు తొలగించారు.

ఉమ్మడి జిల్లాలో భూ కబ్జాల పర్వం యథేచ్ఛగా కొనసాగుతోంది. బడా రాజకీయ నేతలు, రియల్టర్లు చెరువు, కుంటలను మింగేస్తున్నారు. కబ్జాకు కావేవి అనర్హం అన్నట్టుగా ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్, నాలాలను ఆక్రమించి వాటి ఉనికి లేకుండా సవాల్ విసురుతున్నారు. భవనాలు, హాస్టళ్లు, హోటళ్ల వంటి పెద్దపెద్ద నిర్మాణాలు చేపట్టారు. ఫలితంగా వర్షాకాలంలో చెరువులు, కుంటలు, వాగుల్లోకి చేరాల్సిన నీరు రోడ్లపై ప్రవహిస్తోంది. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా మేడ్చల్, శామీర్‌పేట, ఘట్‌కేసర్ మండలాల్లో భారీగా అక్రమ నిర్మాణాలు వెలిశాయి. గత ప్రభుత్వ హయాంలో వీటిపై ఎన్ని ఫిర్యాదులు వచ్చినా అధికారులు ఉదాసీనంగా వ్యవహరించారు. ప్రస్తుతం హైడ్రా రాకతో అక్రమార్కుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. ఉమ్మడి జిల్లాలో కబ్జాలు, ఆక్రమణలపై నేటి నుంచి ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనాలు..

- మేడ్చల్, శామీర్‌పేట, ఘట్‌కేసర్ ప్రాంతాల్లో అత్యధికం
- మాజీమంత్రి మల్లారెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డిల కబ్జాల పర్వం
- ఇష్టారీతిన కాలేజీలు, హోటళ్ల నిర్మాణాలు
- చర్యలు తీసుకోవాలని ఫిర్యాదుల వెల్లువ
- 'హైడ్రా' రాకతో ఆక్రమణదారుల ఉక్కిరిబిక్కిరి

ఎదులాబాద్‌లో

ఓ రియల్‌వ్యాపారి ఘనాపూర్ పంచాయతీ, ఎదులాబాద్ రెవెన్యూ పరిధిలోని సర్వేనెంబర్లు 1182, 1185, 1186, 1187, 1188లోని భూమితో పాటు ఏకంగా చెరువు ఎఫ్‌టీఎల్‌ను ఆక్రమించి మట్టితో నింపారు. దాదాపు రెండుమూడు ఎకరాల వరకు ఎఫ్‌టీఎల్ పరిధి దాటి మట్టితో చదును చేశారు. రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకున్నా తీరుమాత్రం మారలేదు. మళ్లీ యథేచ్ఛగా మట్టితో నింపారు.



చెరువు శిఖం..

కనిపిస్తే ఖతం

యథేచ్ఛగా చెరువులు, కుంటలు ఆక్రమణ

మైసమ్మగూడలో నీట మునిగిన భవనాలు (ఫైల్)

మేడ్చల్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌కు చుట్టూ విస్తరించి ఉన్న మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లాలో భూములు చాలా విలువైనవి. చెరువుల స్థలాలు, ఎఫ్‌టీఎల్‌లు, బఫర్‌జోన్‌లు, నాలాలు కబ్జాకు కావేవి అనర్హం అంటూ బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో మాజీ మంత్రి మల్లారెడ్డి, జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డిల భూబాగోతాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. భారీ కాలేజీ భవనాలు, హాస్టళ్లు, హోటల్ వంటి పెద్దపెద్ద నిర్మాణాలు చేపట్టి యథేచ్ఛగా కబ్జాలకు పాల్పడ్డారు. ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్లలో అక్రమనిర్మాణాలతో చెరువులు, కుంటల ఉనికే కనుమరుగయ్యే పరిస్థితి వచ్చింది. గతప్రభుత్వ హయాంలో ఫిర్యాదులు అందినప్పటికీ అధికారులు చూసీచూడనట్లు ఉన్నారు. చెరువు శిఖం, బఫర్‌జోన్, ఎఫ్‌టీఎల్ పరిధిల్లోనూ యథేచ్ఛగా నిర్మాణాలు చేపట్టారు. ఫలితంగా వర్షాకాలంలో చెరువులు, కుంటలు, వాగుల్లోకి చేరాల్సిన నీరు రహదారులపై ప్రవహిస్తోంది.

కబ్జాల పర్వం 1

నాడెం చెరువు

వెంకటాపూర్‌లోని నాడెం చెరువు కొర్రెముల రెవెన్యూ పరిధి సర్వేనెంబర్లు 814, 816లలో 62 ఎకరాల విస్తీర్ణంలో ఉంది. అయితే గాయత్రి ఎడ్యుకేషన్ ట్రస్టు, అనురాగ్ విద్యాసంస్థ యాజమాన్యం ఈ చెరువు పక్కనే ఉన్న సర్వే నంబరు 813లోని భూమిని కొనుగోలు చేసి చెరువు బఫర్‌ను ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారు. దీనిపై ఇరిగేషన్ అధికారులు పోచారం ఐటీసీ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. సమాజంలో బడా నాయకులు, రియల్ వ్యాపారులే చెరువులు, కుంటలు, బఫర్‌జోన్‌లను ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్నారని, వాటిని సంరక్షించాలని స్థానికులు కోరుతున్నారు.

హైడ్రాతో కబ్జాదారుల్లో వణుకు

రాష్ట్ర ప్రభుత్వం మహానగర విస్తరణకు అనుగుణంగా ప్రజలకు విస్తృత సేవలు అందించేందుకు హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్స్ ప్రొటెక్షన్ అథారిటీ(హైడ్రా) ఏర్పాటు చేసింది. అది ఇప్పటికే కార్యాచరణ మొదలుపెట్టింది. గుండ్లపోచంపల్లి మున్సిపల్ మైసమ్మగూడలో, ఘట్‌కేసర్ మండలంలో పల్లా రాజేశ్వర్‌రెడ్డికి సంబంధించిన సంస్థల ఆక్రమణలపై ఇప్పటికే హైడ్రాకు ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. మైసమ్మగూడలోని మాజీ మంత్రి మల్లారెడ్డికి చెందిన భవనాలను ఇప్పటికే పరిశీలించినట్లు సమాచారం. త్వరలోనే కూల్చివేతలకు హైడ్రా అధికారులు రంగం సిద్ధం చేసినట్లు సమాచారం. ఇందుకోసం ప్రత్యేకంగా డిమాలిషన్ బృందాలను హైడ్రా సిద్ధం చేసినట్లు తెలిసింది. త్వరలోనే పెద్ద ఎత్తున కూల్చివేతలకు రంగం సిద్ధం చేయడంతో పాటు 3, 4 రోజుల పాటు కూల్చివేతలు ఉండనున్నట్లు సమాచారం.



మైసమ్మగూడలో నాలాపై నిర్మించిన రోడ్డు, భవనాలు

బఫర్ జోన్లూ కబ్జా

మేడ్చల్ జిల్లా, ఘట్‌కేసర్ మండలం, ఎదులాబాద్ లక్ష్మీనారాయణ చెరువు దాదాపు 600 ఎకరాల విస్తీర్ణంలో ఉంటుంది. గతంలో ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు చెరువు చుట్టూ ఎఫ్‌టీఎల్ హద్దులు నాటారు. కానీ కొందరు మాత్రం చెరువు పక్కన ఉన్న భూములను కొనుగోలు చేసి యథేచ్ఛగా బఫర్‌జోన్ కాకుండా ఏకంగా ఎఫ్‌టీఎల్ పరిధిలో సైతం మట్టి పోసి చదును చేశారు. చెరువు వైశాల్యాన్ని తగ్గిస్తున్నారు. ఘనాపూర్ పంచాయతీ, ఎదులాబాద్ రెవెన్యూ పరిధి సర్వే నెంబర్లు 1154, 1155, 1156లోని భూమిని మాజీ మంత్రి, ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి సీఎంఆర్ ఎడ్యుకేషన్ సొసైటీ పేరుతో కొనుగోలు చేశారు. చెరువుకు 30 మీటర్ల దూరం బఫర్‌జోన్ వదిలిపెట్టాలనే నిబంధనలు తుంగలో తొక్కారు. సీఎంఆర్ ఎడ్యుకేషన్ సొసైటీ యాజమాన్యం మాత్రం ఏకంగా బఫర్‌జోన్‌ను కబ్జాచేసి మట్టితో నింపారు. రెవెన్యూ అధికారులు గతంలో వాహనాలు సైతం సీజ్ చేశారు.



ఎదులాబాద్ లక్ష్మీనారాయణ చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో మట్టితో నింపిన ప్రదేశం

మైసమ్మగూడలో...



మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా గుండ్లపోచంపల్లి మున్సిపల్ మైసమ్మగూడ పరిధిలో మాజీ మంత్రి మల్లారెడ్డికి చెందిన ఇంజనీరింగ్ కాలేజీలు, యూనివర్సిటీపై హైడ్రాకు ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. మైసమ్మగూడలో ఎటు చూసినా మల్లారెడ్డికి చెందిన భవంతులే కనిపిస్తాయి. మల్లారెడ్డికి చెందిన పలుభవనాల నిర్మాణాలపై పెద్ద ఎత్తున ఫిర్యాదులు ఉన్నప్పటికీ బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో మంత్రిగా ఉండటంతో ఫిర్యాదులపై చర్యలు తీసుకోవడంలో అధికారులు ఆసక్తి చూపలేదు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసిన హైడ్రా ఇటీవల నగరంలోని పలు ప్రాంతాల్లో పెద్ద పెద్ద భవనాలను సైతం నేలకూల్చివేస్తోంది. దీనితో మైసమ్మగూడలోని మల్లారెడ్డికి చెందిన ఇంజనీరింగ్ కాలేజీలు, యూనివర్సిటీపై పెద్ద ఎత్తున హైడ్రాకు ఫిర్యాదులు అందుతున్నాయి. ముఖ్యంగా మైసమ్మగూడలోని కోమటికుంట అలుగులపై నిర్మించిన మల్లారెడ్డి హాస్టల్ భవనంపై అనేక మార్లు ఫిర్యాదులు వచ్చాయి. దీని కారణంగా గత ఏడాది వర్షాకాలంలో పెద్ద ఎత్తున కురిసిన వర్షాలకు మైసమ్మగూడలోని కాలేజీలు, హాస్టళ్లలో వర్షపు నీరు చేరి ఇబ్బందులు పడ్డారు. . కొన్ని హాస్టల్ భవనాలు సగం వరకు మునిగిపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. పోలీసులు, మున్సిపల్ అధికారులు రిస్క్ చేసి భవనాల్లో చిక్కుకుపోయిన విద్యార్థులను జేసీబీ, ట్రాక్టర్ల ద్వారా బయటకు తీసుకువచ్చారు. దీంతో పాటు మైసమ్మగూడలోని పలు ఇంజనీరింగ్ కాలేజీ భవనాలు కూడా అక్రమంగా నిర్మించారనే ఫిర్యాదులు ఉన్నాయి. గతంలో మల్లారెడ్డి యూనివర్సిటీ కోసం పక్కనే ఉన్న హెచ్‌ఎండీఏ వెంచర్‌లో పార్కు స్థలం నుంచి రాత్రికి రాత్రే రోడ్డు వేశారు. ప్రభుత్వం మారిన తర్వాత రోడ్డును తొలగించినప్పటికీ మైసమ్మగూడలో విచారణ చేపడితే మల్లారెడ్డి అక్రమ నిర్మాణాలు పెద్ద ఎత్తున వెలుగులోకి రానున్నాయి.

శామీర్‌పేటలో..



శామీర్‌పేట పెద్ద చెరువు బఫర్ జోన్‌లో నిర్మాణం

జిల్లాలోనే అతి పెద్దది శామీర్‌పేట పెద్ద చెరువు. ఈ చెరువు దాదాపు 1200 ఎకరాల్లో విస్తరించి ఉంది. ఈ చెరువు కింద దాదాపు 7 వేల ఎకరాల ఆయకట్టు సాగవుతోంది. అలియాబాద్ చౌరస్తా సమీపం వరకు ఈ పెద్ద చెరువు నీటితో నిండి విస్తరించి ఉంది. కాగా అలియాబాద్ చౌరస్తా వద్ద దాదాపు ఏడేళ్ల క్రితం మాజీ మంత్రి మల్లారెడ్డి దాదాపు 10ఎకరాల పట్టా భూమిని కొనుగోలు చేశాడు. కాగా ఈపట్టా భూమికి ఆనుకుని శామీర్‌పేట పెద్ద చెరువు ఉంది. నాలుగేళ్ల క్రితం దాదాపు 2 నుంచి 3 ఎకరాల మేరకు చెరువు బఫర్‌ను దర్జాగా కబ్జా చేశాడు. మట్టిపోసి ఎత్తు పెంచి ఆక్రమించాడు.

పకడ్బందీగా గణేశ్ నవరాత్రులు

- జిల్లా అధికారులతో కలెక్టర్ శశాంక సమీక్ష



మాట్లాడుతున్న కలెక్టర్ శశాంక

రంగారెడ్డి అర్బన్, ఆగస్టు30: గణేశ్ నవరాత్రి ఉత్సవాలను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని కలెక్టర్ శశాంక సూచించారు. సెప్టెంబర్ 7న వినాయక చవితిని పురస్కరించుకుని కలెక్టరేట్‌లో శుక్రవారం డీసీపీలు, ఆర్డీఓలు, మున్సిపల్ కమిషనర్లు, పోలీస్ అధికారులు, గణేశ్ ఉత్సవ సమితి, సంబంధిత అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలను అనుసరించి మండపాల నిర్వాహకులు తగు జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. అలాగే నిమజ్జనానికి జిల్లాలో 44 చెరువులను గుర్తించినట్లు తెలిపారు. మున్సిపల్, ఆర్‌అండ్‌బీ శాఖ అధికారులు కలసి పనిచేయాలని సూచించారు. మండపాల దగ్గర ప్రత్యేక సిబ్బందిని ఏర్పాటు చేయాలని, ఫాగింగ్, శానిటేషన్‌పై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. చెరువుల వద్ద వైద్య శిబిరాలను ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, మహేశ్వరం డీసీపీ సునీతారెడ్డి, రాజేంద్రనగర్ డీసీపీ శ్రీనివాస్, డీఆర్వో సంగీత, ఆర్డీవోలు సూరజ్ కుమార్, సాయిరాం, అనంతరెడ్డి, మున్సిపల్ కమిషనర్లు, పోలీస్ అధికారులు, ఆర్‌అండ్‌బీ అధికారులు, బాలాపూర్ గణేశ్ ఉత్సవ సమితి సభ్యులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

పురుగుల అన్నం తినలేం

- రోడ్డుపై బైఠాయించి కస్తూర్బా విద్యార్థుల నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులు

శంషాబాద్, ఆగస్టు 30: నిత్యం తినే అన్నంలో పురుగులు వస్తున్నాయని, దాన్ని తినలేకున్నామని శంషాబాద్ మండలం పాలమాకుల కస్తూర్బా గాంధీ పాఠశాల విద్యార్థులు శుక్రవారం రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. దీంతో కొంతసేపు ఈ రోడ్డుపై భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. ప్రతీనెల ఇవ్వాల్సిన సబ్బులు, నూనెలు సైతం సమయానికి ఇవ్వడం లేదన్నారు. యూనిఫామ్స్ వాసన వస్తుందంటూ విద్యార్థులను టీచర్లు చీదరించుకుంటున్నారని పలువురు విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. విషయం తెలిసిన ఎంఈవో లక్ష్మణ్‌నాయక్, డీఈవో సుశీందర్ రావు అక్కడికి చేరుకొని విద్యార్థులతో మాట్లాడారు. ఇందుకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని విద్యార్థులకు హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు.

సీజనల్ వ్యాధులతో

అప్రమత్తంగా ఉండాలి



చేవెళ్ల ఆస్పత్రిలో రోగుల కేస్ షీట్‌ను పరిశీలిస్తున్న ఆర్వీ కర్ణన్

- వైద్యులు ప్రజలకు అందుబాటులో ఉండాలి
- త్వరలో డయాగ్నోస్టిక్ సెంటర్ ఏర్పాటు చేస్తాం
- రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ కమిషనర్ ఆర్వీ కర్ణన్
- చేవెళ్ల ఏరియా ఆస్పత్రి సందర్శన

చేవెళ్ల, ఆగస్టు 30: సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో ప్రజలతో పాటు వైద్యులు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ ఆర్వీ కర్ణన్ సూచించారు. ఆయన శుక్రవారం చేవెళ్ల ఏరియా ఆసుపత్రిని సందర్శించారు. ఈ సందర్భంగా ఆసుప్రతిలో కలియతిరిగి వైద్యులు, సిబ్బందితోపాటు రోగులతో మాట్లాడి అక్కడి పరిస్థితుల గురించి తెలుసుకున్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యులు ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్యసేవలు అందించాలన్నారు. ఈ ఆస్పత్రి పరిధిలో డెంగీ కేసులు లేవన్నారు. రోగులకు కావాల్సిన అన్ని సౌకర్యాలతో పాటు మందులు అందుబాటులో ఉన్నాయన్నారు. 108 అంబులెన్స్ వాహనం నడిపేందుకు డ్రైవర్ ఏర్పాటు చేస్తామన్నారు. త్వరలో ఆస్పత్రిలో మినీ డయాగ్నోస్టిక్ హబ్‌ను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే వైద్యులు, సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అయితే చేవెళ్ల ప్రభుత్వ ఆసుపత్రి 50 పడకల నుంచి 200 పడకలు ఏర్పాటుకు ఏమైందని విలేకర్లు ప్రశ్నించగా ఎన్నికల ముందు జీవో వచ్చిందని దానికి సంబంధించి ప్రభుత్వం వద్ద టెండర్‌లో ఉందంటూ సమాధానం దాటవేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, జిల్లా వైద్యఆరోగ్య శాఖ అధికారి వెంకటేశ్వరరావు, చేవెళ్ల డిప్యూటీ డీఎంహెచ్‌వో దామోదర్, ఆసుపత్రి వైద్యుడు లక్ష్మీకాంత్, చేవెళ్ల ఎంపీడీవో హిమబిందు, ఎంపీవో విఠలేశ్వర్, గ్రామ కార్యదర్శి రాఘవేందర్, వైద్యులు, సిబ్బంది తదితరులు ఉన్నారు.

మొయినాబాద్ పీహెచ్‌సీ పరిశీలన

మొయినాబాద్ రూరల్: వైద్య సిబ్బంది రోగులకు అందుబాటులో ఉండాలని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ కమిషనర్ కర్ణన్ సూచించారు. ఆయన శుక్రవారం మొయినాబాద్ పీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో ఎవరూ లేకపోవడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయమై జిల్లా వైద్యాధికారిని ప్రశ్నించగా ఆయన మండల వైద్యాధికారిని ఫోనులో సంప్రదించారు. దీంతో ఆమె మండల పరిషత్ కార్యాలయంలో డెంగీ ఇతర రోగాలపై అవగాహన సమావేశంలో ఉన్నట్లు తెలిపారు. సమావేశాలకు వెళ్లే సమయంలో ప్రత్యామ్నాయ సిబ్బందిని ఏర్పాటు చేయాలని అక్కడి అధికారులకు సూచించారు.

కమిషనర్ రాకతో హడావిడి

చేవెళ్ల ఆసుపత్రిలో రాష్ట్ర కమిషనర్ ఆర్వీ కర్ణన్ తనిఖీ ఉందని ముందస్తుగానే ఉన్నతాధికారుల నుంచి సమాచారం ఉండడంతో వైద్యులు, సిబ్బంది డ్రెస్‌కోడ్‌తో ఉత్సాహంగా కనిపించారు. ఆసుపత్రి పరిసరాలు సైతం పరిశుభ్రంగా ఉంచారు. బెడ్స్‌పై సైతం బెడ్‌షీట్స్ మార్చారు. నిత్యం ఒక్కరు ఇద్దరే అందుబాటులో ఉండే వారు కమిషనర్ రాకతో వైద్యులు, సిస్టర్స్, సిబ్బంది అందరు నిండుగా కన్పించారు. ఇది చూసిన స్థానికులు ఆసుపత్రిలో ఇంత మంది వైద్యులు, వైద్యసిబ్బంది పని చేస్తున్నారా? మిగితా రోజుల్లో ఎందుకు కనిపించరని అని చర్చించుకోవడం కన్పించింది.



నందివనపర్తి జ్ఞాన సరస్వతీ ఆలయంలో మహిళల పూజలు

శ్రావణ శోభ

చివరి శ్రావణ శుక్రవారం పురస్కరించుకొని జిల్లా వ్యాప్తంగా మహిళలు సామూహిక వరలక్ష్మీ వ్రతాలు ఆచరించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వ్రతాలు, పూజలతో ఆలయాలు కోలాహలంగా మారాయి.

-యాచారం, ఆగస్టు 30



ఎయిర్‌పోర్టులో అరుదైన ఎయిర్‌క్రాఫ్ట్

శంషాబాద్, ఆగస్టు 30: శంషాబాద్ విమానాశ్రయంలో శుక్రవారం తెల్లవారుజామున అరుదైన ఎయిర్ క్రాఫ్ట్ ల్యాండ్ అయింది. ఇది ప్రపంచంలోని అరుదైన ఎయిర్‌బస్సుల్లో ఒకటి. దీన్ని వేల్ ఆఫ్ ద స్కై(ఆకాశ తిమింగళం)గా పిలుస్తారు. మస్కట్ నుంచి థాయ్‌లాండ్‌కు వెళ్తుండగా మార్గ మధ్యలో శంషాబాద్ ఎయిర్‌పోర్టులో ఆగింది. ఇది ఏ300-608ఎస్‌టీ బెలుగా ఎయిర్‌బస్ రకమని విమానాశ్రయ వర్గాలు తెలిపాయి. కాగా, శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు ఇక్కడి నుంచి బయల్దేరి వెళ్లింది.

తిరుపతికి వెళ్లే విమానం ఆలస్యం

ఆందోళన చేపట్టిన ప్రయాణికులు

శంషాబాద్, ఆగస్టు 30: శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి శుక్రవారం సాయంత్రం తిరుపతికి వెళ్లాల్సిన స్పైస్ జెట్ విమానంలో సాంకేతిక లోపం కారణంగా రాత్రి వరకు బయల్దేరకపోవడంతో అందులో వెళ్లాల్సిన ప్రయాణికులు ఎయిర్‌పోర్టులో ఆందోళన చేపట్టారు. షెడ్యూల్ ప్రకారం సాయంత్రం 6.30 గంటలకు తిరుపతి వెళ్లాల్సిన విమానంలో సాంకేతిక లోపం ఏర్పడడంతో టేకాఫ్ కాకుండా నిలిపివేశారు. విమానంలోని లోపాన్ని సరిచేయించాక బయల్దేరుతుందని ప్రకటించడంతో ప్రయాణికులు ఎయిర్‌పోర్టులోనే ఉండిపోయారు. రాత్రి 10 గంటల వరకు కూడ బయలుదేరకపోవడంతో తమకు ఏదైనా ప్రత్యామ్నాయంగా విమానం ఏర్పాటు చేశాయాలని ఆందోళనకు దిగారు. అయితే ఎయిర్‌పోర్టు వర్గాలు ప్రయాణికులకు సౌకర్యం కల్పించేందుకు కృషి చేస్తున్నామని పేర్కొన్నట్లు సమాచారం.

మున్సిపాలిటీని ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలి

మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్



సమావేశంలో పాల్గొన్న ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యే మల్లారెడ్డి

కీసర రూరల్, ఆగస్టు 30: మున్సిపాలిటీని ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. దమ్మాయిగూడ మన్సిపల్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన కౌన్సిల్ సమావేశానికి మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డితో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతీ వార్డుకు రూ.30లక్షల చొప్పున, వినాయక చవితి, బతుకమ్మ ఉత్సవాలు, తదితర పనుల నిర్వహణకు రూ.9లక్షల కేటాయిస్తూ కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. అనంతరం స్థానికంగా ఉన్న సాయిభవాని ఫంక్షన్‌హాల్‌లో కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ లబ్ధిదారులు 54మందికి చెక్కులను అందజేసారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ వసుపతి ప్రణీత, కమిషనర్ నాగమణి, వైస్‌ఛైర్మన్ నరేందర్‌రెడ్డి, కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, మేనేజర్ వెంకటేశం, మున్సిపల్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

మోమిన్‌పేట్ సీఐగా నవీన్‌కుమార్



మోమిన్‌పేట్, ఆగస్టు 30: మోమిన్‌పేట్ సర్కిల్ సీఐగా నవీన్‌కుమార్ శుక్రవారం ఉద్యోగ బాధ్యతల స్వీకరించారు. ఇక్కడ పని చేసిన సీఐ అంజనేయులు బదిలీ కావడంతో ఆయన స్థానంలో నవీన్‌కుమార్ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలో నూతన సీఐ నవీన్‌కుమార్ ఎస్పీ నారాయణరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు.


బండవెల్కిచర్ల గిరిజన సంక్షేమ గురుకుల కళాశాల

గురుకులంలో చేరేందుకు విద్యార్థుల అనాసక్తి

కులకచర్ల, ఆగస్టు 27: మండలంలోని బండవెల్కిచర్ల గిరిజన సంక్షేమ గురుకుల బాలుర కళాశాల మొదటి సంవత్సరంలో చేరేందుకు విద్యార్థులు ఉత్సాహం చూపడం లేదు. దీంతో ఆయా గ్రూపుల్లో సీట్లు ఖాళీగా ఉంటున్నాయి. ఆన్‌లైన్ కౌన్సెలింగ్ పూర్తయింది. రెండుసార్లు నేరుగా డోర్ కౌన్సెలింగ్ నిర్వహించినా సీట్లు భర్తీ కావడం లేదు. ఇక్కడి కళాశాలలో ఎంపీసీ, బైపీసీ గ్రూపులు ఉన్నాయి. ఒక్కో గ్రూపులో 40సీట్లు ఖాళీగా ఉన్నాయి. ఎంపీసీ గ్రూపులో 40సీట్లు ఉన్నాయి. ఎంపీసీ గ్రూపులో 30మంది చేరగా ఇంకా 10సీట్లు ఖాళీగా ఉన్నాయి. అదేవిధంగా బైపీసీ గ్రూపులో 18మంది విద్యార్థులు చేరగా 22 సీట్లు ఖాళీగా ఉన్నాయి. కళాశాలలో బోధన, భోజన వసతులు సరిగా లేవనే ఆరోపణలు ఉన్నాయి. నాలుగు సంవత్సరాలుగా ఇంటర్‌లో ఉత్తీర్ణత శాతం తగ్గుతూ వస్తోంది. గత ప్రిన్సిపాల్ పని ఒత్తిడి కారణంగా ఇద్దరు దినసరి వేతన సిబ్బంది ఆత్మహత్య చేసుకున్నారు. తోటి అధ్యాపకులతో ప్రిన్సిపాల్‌కు విభేదాలు ఉన్నట్లు ఆరోపణలున్నాయి. ప్రస్తుతం ఆప్రిన్సిపాల్ మెదక్‌కు బదిలీపై వెళ్లారు. కానీ వేతనం మాత్రం ఇక్కడే పొందుతున్నారు. కళాశాలలో చేరేందుకు వచ్చే విద్యార్థులకు ఇక్కడ జరిగే విషయాలు వివరించి చేరవద్దని ఇక్కడ చదువుతున్న విద్యార్థులే చెబుతున్నట్లు సమాచారం. దీంతో ఇంటర్‌లో చేరేందుకు విద్యార్థులు ఉత్సాహం చూపడం లేదని తెలుస్తోంది.

శస్త్రచికిత్సలకు మళ్లీ బ్రేక్

ఇబ్బంది పడుతున్న రోగులు ● తాండూరుకు డిప్యూటేషన్‌పై మరో సర్జన్


తాండూరు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి

తాండూరు, ఆగస్టు 30: సాధారణ బదిలీల ప్రభావం తాండూరు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిపై పడింది. సర్జన్లు, సివిల్ సర్జన్లు బదిలీపై వెళ్లడం వారి స్థానంలో ఇతర సర్జన్లు రాకపోవడంతో శస్త్ర చికిత్సలు నిలిచిపోయాయి. ఈ విషయమై గతంలో ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనంపై అప్పటి జిల్లా వైద్య విధాన పరిషత్ కోఆర్డినేటర్ డాక్టర్ ప్రదీప్ కుమార్, కలెక్టర్, స్థానిక ఎమ్మెల్యే మనోహర్ రెడ్డిల అనుమతితో వికారాబాద్ ఆస్పత్రిలో కాంట్రాక్ట్ పద్ధతిపై పనిచేస్తున్న డాక్టర్ అజయ్‌కుమార్ డిప్యూటేషన్‌పై తాండూరుకు బదిలీచేశారు. అయితే ఆయన తాండూరు ఆస్పత్రికి రాకుండా వికారాబాద్ మెడికల్ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా చేరారు. దీంతో డీసీహెచ్‌లో బదిలీపై వెళ్లిన సర్జన్‌ను పిలిపించి ఒక రోజు శస్త్ర కిత్సలు చేయించారు. తప్పనిసరి అవసరం దృష్ట్యా పరిగి ఆస్పత్రి నుంచి సర్జన్ డాక్టర్ అంబుప్రసాద్‌ను డిప్యూటేషన్‌పై తాండూరు జిల్లా ఆస్పత్రికి రానున్నారు. సోమవారం విధుల్లో చేరుతారని జిల్లా వైద్య విధాన పరిషత్ కోఆర్డినేటర్ డాక్టర్ ప్రదీప్ కుమార్ చెప్పారు. ఇదిలా ఉండగా, చిన్నచిన్న సర్జన్లు చేసుకోవడానికి తాండూరు ఆస్పత్రికి వచ్చే రోగుల సంఖ్య అధికంగా ఉంటుంది. పర్మినెంట్‌గా 24గంటలు అందుబాటులో ఉండే సర్జన్ అవసరముంది. ఇప్పటికైనా పర్మినెంట్ సర్జన్‌ను నియమించాలని స్థానికులు కోరుతున్నారు.

క్రీడల్లో గెలుపొందిన అధికారులకు బహుమతులు అందజేత


క్రీడల్లో పాల్గొన్న అధికారులతో అదనపు కలెక్టర్ రాధికా గుప్తా

మేడ్చల్, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జాతీయ క్రీడాదినోత్సవాన్ని పురస్కరించుకుని మేడ్చల్ కలెక్టరేట్‌లో పనిచేసే ఉద్యోగులకు నిర్వహించిన క్రీడల్లో గెలుపొందిన అధికారులకు శుక్రవారం అదనపు కలెక్టర్ రాధికా గుప్తా బహుమతులను అందజేశారు. 50 మీటర్ల వాకింగ్, 100 మీటర్ల వాకింగ్, 50 మీటర్ల రన్, 100 మీటర్ల రన్, లెమన్ స్పూన్, మ్యూజికల్ ఛైర్, టగ్ ఆఫ్ వార్, షార్ట్ పుల్, చెస్, వాలీబాల్ , క్రికెట్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో డీఆర్వో హరిప్రియ తదితరులు పాల్గొన్నారు.

పోచారం ఐటీసీ పోలీస్‌స్టేషన్ భవనానికి స్థలం కేటాయింపు


ఉత్తర్వు పత్రాన్ని ఏసీపీకి అందజేస్తున్న రెవెన్యూ అధికారులు

ఘట్‌కేసర్ రూరల్, ఆగస్టు30: పోచారం ఐటీసీ పోలీస్‌స్టేషన్ భవన నిర్మాణానికి శుక్రవారం రెవెన్యూ అధికారులు రెండెకరాల ప్రభుత్వభూమిని కేటాయిస్తూ ఉత్తర్వు పత్రాన్ని మల్కాజ్‌గిరి ఏసీపీ చక్రపాణికి అందజేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు కొర్రెముల రెవెన్యూ పరిధిలోని సర్వేనెంబర్లు 808లోని 1.20 గుంటలు, 840లోని 20గుంటల ప్రభుత్వ భూమిని రెవెన్యూ అధికారులు పోచారం పోలీస్ స్టేషన్‌కు కేటాయించి ఉత్తర్వులను పోలీసు అధికారులకు అందజేశారు. అనంతరం ఏసీపీ చక్రపాణి, సీఐ రాజువర్మతో కలిసి పోలీస్‌స్టేషన్ నూతన భవనానికి శంకుస్థాపన చేశారు. ప్రజల భద్రత విషయంలో ప్రజలకు పోలీసులు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటారని ఏసీపీ తెలిపారు. ఆపదలో ఉన్నప్పుడు 100కు డయల్ చేయాలని సూచించారు. త్వరలో పోలీస్‌స్టేషన్ భవనం నిర్మాణం పూర్తి చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు సాయి రామ్, కావ్య, వినయ్‌కుమార్, ఎస్‌ఐలు బద్దం నాగార్జున్‌రెడ్డి, శివకృష్ణ, మాజీ ఎంపీటీసీ నీరుడి రామారావు, నాయకులు నీరుడి శ్రీనివాస్, బుర్ర వెంకటేష్, కట్ట సత్యనారాయణ, వేణుగోపాల్, చింతపంట్ల సత్తయ్యయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు నైపుణ్యం పెంపొందించుకోవాలి


మాట్లాడుతున్న జిల్లా విద్యాశాఖ అధికారి రేణుకాదేవి

యాలాల, ఆగస్టు 30: ఉపాధ్యాయులు విద్యాబోధనలో నైపుణ్యం పెంపొందించుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి రేణుకా దేవి అన్నారు. మండలంలోని అగ్గనూర్ జడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో శుక్రవారం కాంప్లెక్స్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యా వ్యవస్థ బలోపేతానికి ఆధునిక నైపుణ్యాలు అమలు చేయడానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో సుధాకర్‌రెడ్డి, అగ్గనూర్ కాంప్లెక్స్ హెచ్ఎం సుధాకర్ పాల్గొన్నారు.

మా నేత లేకుండా చెక్కులు పంచుతారా?


గొడవపడుతున్న బీఆర్ఎస్ కాంగ్రెస్ నాయకులు


అధికారులతో కాంగ్రెస్ నేతల వాగ్వాదం

- మేడ్చల్‌లో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీలో నేతల లొల్లి
- వాగ్వాదానికి దిగిన బీఆర్ఎస్, కాంగ్రెస్ శ్రేణులు
- సీఎంకు ఫిర్యాదు చేస్తామన్న అధికార పార్టీ నేతలు

మేడ్చల్ టౌన్, ఆగస్టు 30: మేడ్చల్ మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం అధికారికంగా నిర్వహించిన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమం రసాభాసగా మారింది. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీ నేతలు తీవ్ర వాగ్వాదానికి దిగారు. ఫలితంగా చెక్కుల పంపిణీ కార్యక్రమం ఒక్కసారిగా అట్టుడికిపోయింది. నేతలు ఎందుకు గొడవ పడుతున్నారంటూ అక్కడ ఉన్న వారికి కొద్దిసేపటిదాకా అర్థంకాలేదు. నేతలు మధ్య జరుగుతున్న మాటల యుద్ధం తారాస్థాయికి చేరటంతో చెక్కులు తీసుకోవటానికి వచ్చిన లబ్ధిదారులు నేతల తీరుతో విస్తుపోయారు. తాము ఓటేసి గెలిపించిన ఎంపీ, ఎమ్మెల్యేలు వచ్చినా ఇంకా ఎవరి కోసం నేతలు గొడవ పడుతున్నారంటూ అక్కడున్న లబ్ధిదారులు కాంగ్రెస్ నేతలనే అడిగి తెలుసుకున్నారు. టీపీసీసీ ఉపాధ్యక్షుడు, మేడ్చల్ నియోజకవర్గం ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్‌యాదవ్ రాకుండా చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించటం పట్ల స్థానిక కాంగ్రెస్ నేతలు అసహనానికి గురవడాన్ని చూసి లబ్ధిదారులు నివ్వెరపోయారు. ఈకార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే చామకూర మల్లా రెడ్డి, మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్‌తో పాటు మేడ్చల్, గుండ్ల పోచంపల్లి మున్సిపాలిటీలకు చెందిన కౌన్సిలర్లు, మాజీ సర్పంచ్, ఎంపీటీసీలు, కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలకు చెందిన నేతలు పాల్గొన్నారు. అధికారికంగా కార్యక్రమం నిర్వహిస్తున్నందున స్థానిక డిప్యూటీ తహసీల్దార్ సాయికుమార్ ఎమ్మెల్యే మల్లారెడ్డి, ఎంపీ ఈటల రాజేందర్ చేతులమీదుగా లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు. అనంతరం ఎంపీ, ఎమ్మెల్యేలు తామొచ్చిన పని ముగిసిందంటూ అక్కడ నుంచి వెళ్లారు. అనంతరం కాంగ్రెస్ నాయకులు తమ నేత రాకుండా చెక్కుల పంపిణీ ఎలా చేస్తారంటూ అధికారులపై, బీఆర్ఎస్, బీజేపీ నేతలపై మండిపడ్డారు. అధికారిక కార్యక్రమంలో అనధికారిక నేతల పనేందంటూ కొందరు బీఆర్ఎస్ నేతలు కాంగ్రెస్ నేతలకు బదులివ్వటంతో గొడవకు ఆజ్యం పోసినట్లైంది. అధికార కార్యక్రమాన్ని అధికారులు నిర్వహిస్తారే తప్ప తమ పార్టీ నేతలు కాదని బీఆర్ఎస్, బీజేపీ నేతలు చెప్పడంతో కాంగ్రెస్ నేతలు డిప్యూటీ తహసీల్దార్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై స్పందించిన డిప్యూటీ తహసీల్దార్ అధికారిక కార్యక్రమం కావటంతో తాము లబ్ధిదారులకు, స్థానిక, ఎంపీ, ఎమ్మెల్యేలకు సమాచారం ఇవ్వటంతో పాటు ఇతర ప్రముఖులకు సమాచారం ఇచ్చామని తెలిపారు.

సీఎంకు, జిల్లా ఇన్‌చార్జి మంత్రికి ఫిర్యాదు చేస్తాం

తమ నేత మేడ్చల్ నియోజకవర్గం ఇన్‌చార్జి వజ్రేష్ యాదవ్ లేకుండా చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించి తమను అవమానించారని కాంగ్రెస్ నేతలు ఈ సందర్భంగా ఆరోపించారు. ఈ విషయం పట్ల సీఎం, జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్ బాబుకు ఫిర్యాదు చేస్తామని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రమణారెడ్డి, మేడ్చల్ మున్సిపల్ మాజీ అధ్యక్షుడు, వేముల శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు సంజీవరావు అన్నారు. అధికారంలో ఉన్నా తమను లెక్కచేయని వారి పై చర్యలు తప్పవని హెచ్చరించారు. తమనేత రాకముందే చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని ఉద్దేశపూర్వకంగా ముగించి ఎంపీ, ఎమ్మెల్యేలు జారుకున్నారన్నారు. కాగా అధికారిక కార్యక్రమం నిర్వహించే బాధ్యత అధికారులపై ఉంటుందని, ప్రొటోకాల్ వర్తిస్తుందని బీజేపీ, బీఆర్ఎస్ నేతలు అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.

ఆరు గ్యారెంటీలను పక్కకు పెట్టేందుకే హైడ్రా డ్రామా



రుణమాఫీ అమలులో ఘోరంగా విఫలమైన ప్రభుత్వం

మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి

మహేశ్వరం, ఆగస్టు 30: కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు ఆరు గ్యారెంటీలను అమలు చేయలేక, పక్కకు పెట్టడానికే హైడ్రాను తెరపైకి తెచ్చిందని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి ప్రభుత్వంపై మండిపడ్డారు. శుక్రవారం మహేశ్వరంలో రైతు రుణమాఫీపై వ్యవసాయాధికారులతో నిర్వహించిన సమీక్ష అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీల్లో ప్రధానంగా రైతు రుణమాఫీ ఒకటని, దానిని అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. రైతు రుణమాఫీ విషయంలో ఏ ఒక్క శాఖకు కూడా పూర్తిగా అవగాహన లేదని, రైతుల ఎవరిని అడగాలో తెలియక అనేక రకాలుగా ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ముఖ్యమంత్రి మాత్రం రైతు రుణమాఫీ రూ.31 వేల కోట్లు అని ప్రచారం చేసుకుంటున్నారని, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాత్రం రూ.7వేల కోట్లు మాఫీ చేశామని చెప్పడం సిగ్గుచేటన్నారు. రైతు బంధును పక్కకుపెట్టి అరకొర రైతు రుణమాఫీ చేయడంతో రైతులు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. అలాగే గ్రామపంచాయతీ వ్యవస్థను అస్తవ్యస్తం చేసి వాటి పాలనను గాలికొదిలేసి గ్రామాల్లో పని చేస్తున్న కార్మికులకు కనీస వేతనం చెల్లించలేని స్థితిలో ప్రభుత్వం ఉండడం బాధాకరమన్నారు. మిషన్ భగీరథ, శానిటేషన్ తదితర విషయాల్లో ప్రభుత్వం విఫలమైందన్నారు. ఒక్క రైతులనే కాదు రాష్ట్రంలో విద్య, వైద్యం వంటి ప్రధాన శాఖలను కూడా ముఖ్యమంత్రి వీధులపాలు చేశాడన్నారు. అభివృద్ధిని పక్కకు పెట్టి హైడ్రాను తెరపైకి తెచ్చి ప్రజలను భయభ్రాంతులకు గురిచేసేందుకేనా ప్రజలు కాంగ్రెస్‌కు అధికారం కట్టబెట్టిందని ప్రశ్నించారు. ఇప్పటివరకు ప్రజలను మోసం చేసింది చాలదన్నట్లు.. మళ్లీ రేషన్‌కార్డులు, హెల్త్ కార్డుల కోసం ప్రజాపాలన కార్యక్రమం నిర్వహిస్తామని ముఖ్యమంత్రి చెప్పడం సిగ్గుచేటన్నారు. ఇప్పటికీ ఏ ఒక్కరికీ గ్యాస్ సబ్సిడీ రాలేదని, రెండు వందల యూనిట్ల ఉచిత విద్యుత్ తదితర సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. అధికారంలోకి వచ్చినప్పటి నుంచి కాంగ్రెస్ ప్రభుత్వం ఓ ఒక్క అభివృద్ధి పని మొదలు పెట్టలేదన్నారు. అసెంబ్లీ బడ్జెట్ మీటింగ్‌లో రాష్ట్రంలోని పరిస్థితులపై ముఖ్యమంత్రి అవగాహన లేకుండా మాట్లాడుతున్నాడని సబితారెడ్డి అన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు పాండుయాదవ్, సురేందర్ రెడ్డి, నవీన్, ప్రభాకర్‌రెడ్డి, సుధీర్‌గౌడ్, సమీర్, కె.చంద్రయ్య, రాజునాయక్, కె.ప్రభాకర్, పి.బాలయ్య, ఆదిల్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కోటమైసమ్మ ఆలయ వార్షికోత్సవం

షాద్‌నగర్ అర్బన్, ఆగస్టు 30: షాద్‌నగర్ పట్టణంలోని రైతు కాలనీలో వెలసిన కోటమైసమ్మ ఆలయ మొదటి వార్షికోత్సవాన్ని శుక్రవారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ప్రత్యేక పూజలు, హోమాలు, అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కాలనీవాసులతో పాటు పట్టణ ప్రముఖులు, భక్తులు అధిక సంఖ్యలో హాజరై, అమ్మవారికి భక్తిని చాటుకున్నారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ హాజరై పూజ చేసి, అన్నదానం కోసం రూ.11వేలు ఇచ్చారు. మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి, కౌన్సిలర్ ప్రతాప్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ ముఖ్యనాయకులు జి.బాల్‌రాజ్‌గౌడ్, చెంది తిరుపతిరెడ్డి, కొంకళ్ళ చెన్నయ్య, సుదర్శన్‌గౌడ్, శివశంకర్‌గౌడ్, అగ్గనూరి బస్వం, కృష్ణారెడ్డి, మురళీమోహన్, కట్ట వెంకటేష్, ఆలయ నిర్వహణ కమిటీ సభ్యులు శుక్రవర్ధన్‌రెడ్డి, ఎండి ఖాజాపాష, వెంకటేశ్వర్‌రెడ్డి, బుచ్చయ్య, మల్లేష్‌గౌడ్, వెంకట్‌రాంరెడ్డి, గోపాల్‌రెడ్డి, నారాయణ రెడ్డి, గంధం ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.


వార్షికోత్సవంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, పట్టణ ప్రముఖులు

ఈ పంచాయతీ కార్యదర్శి మాకొద్దు



కులకచర్ల, ఆగస్టు 30: ఈ పంచాయతీ కార్యదర్శి మాకొద్దంటూ కులకచర్ల మండలంలోని గోరిగడ్డతండా ప్రజలు శుక్రవారం వికారాబాద్ డీపీవోకు ఫిర్యాదు చేశారు. తండాకు కొత్తగా వచ్చిన కార్యదర్శి పించన్ల పంపిణీలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాడని, తాము స్వయంగా ఫిర్యాదు చేసినా తండాకు రావడం లేదని తండావాసులు ఆరోపించారు. తండాలో పారిశుధ్యం లోపించిందని తెలిపినా పట్టించుకోవడం లేదని ఫిర్యాదులో పేర్కొన్నారు.

మహిళా సంఘాల పనితీరు భేష్

ఎన్ఐఆర్డీ ప్రతినిధుల కితాబు


సంఘాల సభ్యులతో మాట్లాడుతున్న ఎన్ఐఆర్డీ బృందం

మహేశ్వరం, ఆగస్టు 30: మహేశ్వరంలో మహిళా సంఘాల పనితీరు చాలా బాగుందని ఈ విధానం దేశంలోని అన్ని రాష్ట్రాల్లో విస్తరింపజేస్తే బాగుంటుందని ఎన్ఐఆర్డీ ప్రతినిధుల బృందం కితాబిచ్చింది. శుక్రవారం మండలంలోని మొహబ్బత్‌నగర్‌లో తొమ్మిది రాష్ట్రాలకు చెందిన వివిధ శాఖల 21 మంది ప్రతినిధుల బృందం పర్యటించింది. ఈ సందర్భంగా మహిళా సంఘాల పనితీరు, పుస్తక నిర్వహణ, సంఘాల బలోపేతం మహిళలు ఆర్థికంగా ఎదుగుతున్న తీరు తదితర అంశాలపై వారిని అడిగి తెలుసుకున్నారు. మహిళలు సంఘాల ద్వారా వివిధ బ్యాంకుల నుంచి రుణాలు తీసుకొని అనేక వ్యాపారాలు చేస్తూ రాణించడం అభినందనీయమని వారు తెలిపారు. కార్యక్రమంలో ఎన్ఐఆర్డీ మేనేజర్ శ్రీనివాస్, ఎంపీడీవో శైలజ, ఏపీఎం సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో బోనాల వైభవం


బోనమెత్తిన మహిళా ఉద్యోగులు

రంగారెడ్డి అర్బన్, ఆగస్టు 30: గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో ఘనంగా బోనాల జాతరను జరుపుకున్నారు. మహిళా ఉద్యోగులతో పాటు వారి కుటుంబీకులు పాల్గొనడంతో సందడి వాతావరణం నెలకొంది. డప్పు చప్పుళ్ల మధ్య నృత్యాలు చేస్తూ బోనాలను తీశారు. కలెక్టరేట్‌లోని నవదుర్గమాత ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అమ్మవారికి దూప, దీప నైవేద్యాలను సమర్పించుకున్నారు. కార్యక్రమంలో డీఆర్డీఏ పీడీ శ్రీలత, సూపరింటెండెంట్ శివప్రసాద్, ఏవో శారద, సీవోలు శిరీష, ప్రశాంతి, సునంద, మహిళా ఉద్యోగులు శ్వేత, శ్రవంతి, శ్రాజ్య, అంబిక, కరుణ, విజయ, మీనాక్షి, రజిత, ఏపీడీలు సక్రియ, చరణ్ గౌతమ్, వెంకట్, నరేష్, పరిశురాం, తదితరులు పాల్గొన్నారు.

సంగెంకలాన్ మైనింగ్ భూముల్లో రెవెన్యూ అధికారుల సర్వే


సంగెంకలాన్‌లో సర్వే నిర్వహిస్తున్న రెవెన్యూ సిబ్బంది

తాండూరు రూరల్, ఆగస్టు 30: మండలంలోని సంగెంకలాన్ గ్రామ శివారులోని ప్రభుత్వ సర్వేనెంబర్-109/3/3లో 15గుంటల విస్తీర్ణంలో అక్రమ తవ్వకాలు జరుపుతున్నారని ఆ గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఫిర్యాదు మేరకు రెవెన్యూ అధికారులు శుక్రవారం సర్వే నిర్వహించారు. సంగెంకలాన్ గ్రామానికి చెందిన తిప్పన్న సర్వేనెంబర్-109లో శివారెడ్డి అనే వ్యక్తి 15గుంటల భూమిని కబ్జా చేసుకుని అక్రమ తవ్వకాలు చేస్తున్నారని తిప్పన్న ఇటీవల రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో జిల్లా ఉన్నతాధికారుల ఫిర్యాదు మేరకు అట్టి సర్వే నెంబర్‌ను సర్వే చేసి నివేదిక ఇవ్వాలని జిల్లా రెవెన్యూ అధికారులు తాండూరు తహసీల్దార్ తారాసింగ్‌ను ఆదేశించారు. తహసీల్దార్ ఆదేశాల మేరకు తాండూరు మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ గోపి, మండల సర్వేయర్ మహేష్‌లు క్షేత్రస్థాయిలో పర్యటించి, ఆ సర్వే నెంబర్‌కు సంబంధించిన సమగ్ర వివరాలను సేకరించి సర్వే నిర్వహించారు. శివారెడి అనే వ్యక్తి ఏ మేరకు కబ్జా చేశాడు, ఎంత విస్తీర్ణంలో కబ్జా చేశారు, తవ్వకాలు ఏ మేరకు జరిపారనే విషయాలను రెవెన్యూ అధికారులు సమగ్రంగా సేకరించారు. అట్టి వివరాలను క్రోడీకరించి జిల్లా రెవెన్యూ అధికారులకు నివేదించనున్నట్లు తహసీల్దార్ తారాసింగ్ తెలిపారు. ఆయన వెంట రెవెన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

డెంగీ పట్ల అప్రమత్తంగా ఉండాలి


సిబ్బందితో మాట్లాడుతున్న టీఎస్ఎంఎస్ఐడీసీ ఎండీ హేమంత్

ఇబ్రహీంపట్నం, ఆగస్టు 30 : డెంగీ పట్ల ప్రజలను అప్రమత్తం చేయాలని తెలంగాణ స్టేట్ మెడికల్ సర్వీసెస్, మౌలిక వసతుల అభివృద్ధి కార్పొరేషన్ ఎండీ హేమంత్ వైద్యాధికారులకు సూచించారు. శుక్రవారం సాయంత్రం ఆయన ఇబ్రహీంపట్నం సీహెచ్‌సీని సందర్శించి వైద్యాధికారులతో రివ్యూ చేశారు. డెంగీ, మలేరియా, విష జ్వరాల కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో సౌకర్యాలపై ఆరా తీశారు. అన్ని రకాల మందులు, వైద్య పరికరాలు అందుబాటులో ఉండేట్లు చూడాలన్నారు. అదేవిధంగా వైద్యులు 24 గంటలు రోగులకు అందుబాటులో ఉండాలని, లేదంటే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. ఆసుపత్రి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని సిబ్బందిని ఆదేశించారు.

కొత్త మోటార్ వెహికిల్ చట్టాన్ని రద్దు చేయాలి


మాట్లాడుతున్న దేవేందర్

మొయినాబాద్ రూరల్, ఆగస్టు 30: కొత్త మోటార్ వెహికిల్ చట్టాన్ని రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్ డిమాండ్ చేశారు. శుక్రవారం మండల పరిధిలోని అజీజ్‌నగర్ గ్రామ నూతన ఆటో యూనియన్ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్ష, కార్యదర్శులుగా మహేందర్, చెన్నయ్యలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో దేవేందర్ పాల్గొని మాట్లాడుతూ ఎంవీ యాక్టు ప్రకారం విపరీతమైన చల్లాన్లను ఆటో కార్మికులు ఎదుర్కొంటున్నారని, ట్రాఫిక్ పోలీసులు ఆటో కార్మికులను వేధిస్తున్నారని ఆరోపించారు. 2019 నూతన వెహికిల్ చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆటో కార్మికులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని కోరారు. ఆటో కార్మికులకు ఏ ఆపద వచ్చిన ముందు ఉండి పోరాడుతామని నూతనంగా ఎన్నికైన అధ్యక్ష, కార్యదర్శులు మహేందర్, చెన్నయ్యలు అన్నారు. సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు ప్రవీన్‌కుమార్, సీహెచ్ ప్రవీన్‌కుమార్, గ్రామపంచాయతీ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు రత్నం తదితరులు పాలొన్నారు.

శాంతిభద్రతల నియంత్రణలో అలసత్వం తగదు

శంషాబాద్ డీసీపీ రాజేశ్



పోలీసు స్టేషన్‌లో రికార్డులు తనిఖీ చేస్తున్న డీసీపీ రాజేశ్

తలకొండపల్లి, ఆగస్టు 30: శాంతి భద్రతల పరిరక్షణలో ఎక్కడ కూడా అలసత్వానికి తావుండకూడదని శంషాబాద్ డీసీపీ బి.రాజేశ్ అన్నారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణకు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని సూచించారు. తలకొండపల్లి పోలీసు స్టేషన్‌ను శుక్రవారం డీసీపీ సందర్శించారు. ఈ సందర్భంగా రికార్డులు, నిర్వహణ తీరు, పోలీసు స్టేషన్ ఆవరణ, సిబ్బంది పనితీరును పరిశీలించారు. అనంతరం ఏసీపీ రంగస్వామి, ఆమనగల్లు సీఐ ప్రమోద్ కుమార్, స్థానిక సీఐ శ్రీకాంత్‌తో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. పెండింగ్ కేసులు, రోడ్డు ప్రమాదాల నివారణకు చేపడుతున్న చర్యలు, కేసుల దర్యాప్తు గూర్చి అధికారులకు డీసీపీ పలు సూచనలు చేశారు. కొత్త చట్టాలను ప్రతీ పోలీసు స్టేషన్‌లో అమలు పరుచాలని ఆదేశించారు. రోడ్డు భద్రతా నియమాల ఉల్లంఘనలను ఉపేక్షించవద్దని, రోడ్డు భద్రతా నియమాలు, డ్రంక్ అండ్ డ్రైవ్‌పై కళాశాలలు, పాఠశాలల్లో అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. పెండింగ్ కేసుల దర్యాప్తు వేగవంతం చేయాలని, కేసుల్లో అరెస్ట్ కాని వారిని వెంటనే అరెస్ట్ చేయాలని ఆదేశించారు. వారెంట్లు, సమన్లు పెండింగ్‌లో ఉంచకుండా సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. రాత్రీపగలు బీట్ల పనితీరును నిరంతరం మానిటరింగ్ చేసి నేరాలను నియంత్రించాలని సూచించారు. గణేశ్ నవరాత్రోత్సవాలు శాంతియుతంగా జరిగేలా చూడాలని, అన్ని గ్రామాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకునేలా చొరవ తీసుకోవాలని సూచించారు. అనంతరం పోలీసు సిబ్బంది సమస్యలు అడిగి తెలుసుకొని పరిష్కారానికి కృషి చేస్తానని డీసీపీ తెలిపారు. ఎస్సై శ్రీకాంత్ పనితీరును డీసీపీ అభినందించారు.



ఆర్డీవోను సన్మానిస్తున్న ప్రభాకర్‌రెడ్డి

ఆర్డీవో సేవలు అభినందనీయం

కందుకూరు, ఆగస్టు 30 : ఆర్డీవో సూరజ్‌కుమార్ సేవలు అభినందనీయమని కందుకూరు మండల మాజీ వైస్ ఎంపీపీ గంగుల శమంతప్రభాకర్‌రెడ్డి అన్నారు. నేడు(శనివారం) పదవీ విరమణ చేయనున్న కందుకూరు ఆర్డీవో సూరజ్ కుమార్ నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో ఉండాలని భగవంతుడని కోరుకుంటున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆర్డీవోను వారు సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల కో-ఆర్డినేటర్ అఫ్జల్‌బేగ్, ప్రభాకర్‌రెడ్డి ఉన్నారు.

నందిగామలో కార్డన్ సర్చ్



కార్డన్‌సర్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

నందిగామ, అగస్టు 30: మండలంలోని అయ్యప్ప టెంపుల్ కాలనీలో శుక్రవారం రాత్రి శంషాబాద్ ఏసీపీ శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో 119 పోలీసులు 8 బృందాలుగా ఏర్పడి కార్డన్‌సర్చ్ నిర్వహించారు. ఇళ్లను తనిఖీ చేసి ఎలాంటి పత్రాలు లేని ద్విచక్ర వాహనాలు, కార్లను సీజ్ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఏసీపీ శ్రీనివాస్ రావు మాట్లాడుతూ శాంతిభద్రతల కోసం కార్డన్‌సర్చ్ నిర్వహిస్తున్నామని, ప్రతీఒక్కరు వాహనాలను సరైన పత్రాలతో నడిపించాలని తెలిపారు. నందిగామ మండలంలో సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రజలు సహకరించాలని ఏసీపీ కోరారు. కార్డన్‌సర్చ్‌లో నందిగామ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, కొత్తూరు ఇన్‌స్పెక్టర్ నర్సింగ్‌రావు ఎస్సై గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మైనర్లు వాహనాలు నడపొద్దు : ఏసీపీ

చేవెళ్ల, ఆగస్టు 30 : మైనర్లు వాహనాలు నడుపుతూ పట్టుబడితే.. వారితో పాటు వాహన యజమానిపై కఠిన చర్యలు తీసుకుంటానమని రాజేంద్రగనర్ డివిజన్ ట్రాఫిక్ ఏసీపీ బాలాజీ నాయక్ తెలిపారు. శుక్రవారం చేవెళ్ల ట్రాఫిక్ సీఐ వెంకటేశం ఆధ్వర్యంలో చేవెళ్ల మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో విద్యార్థులకు, స్కూల్ యాజమన్యం, బస్‌డ్రైవర్లకు ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులందరికీ నిర్ధీత వయస్సు వచ్చాక లైసెన్స్ పొంది మాత్రమే వాహనాలు నడపాలని సూచించారు. మైనర్లు వాహనం నడిపితే వారి ప్రాణాలకే కాకుండా ఇతరుల ప్రాణాలకు కూడా ప్రమాదమన్నారు. ట్రాఫిక్ రూల్స్ ఉల్లంఘనలపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. చేవెళ్ల ట్రాఫిక్ పోలీస్‌లు, తదితరులు పాల్గొన్నారు.

పులా.. హైనానా?

● పాదముద్రలతో ప్రజల భయాందోళన



గ్రామస్తులు గుర్తించిన జంతువు పాదముద్రలు

నందిగామ, అగస్టు 30: మండలంలోని అప్పారెడ్డిగూడ శివారులోని పొలాల్లో శుక్రవారం గుర్తుతెలియని జంతువు ఆనవాళ్లు కనిపించడంతో ప్రజలు భయాందోళనకు గురౌతున్నారు. సమాచారం తెలుసుకున్న పోలిసులు ఘటనా స్థలానికి చేరుకొని పాదముద్రలను పరిశీలించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అయితే, అవి చిరుత లేదా హైనా పాదముద్రలు అయి ఉండవచ్చని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఫారెస్ట్ అధికారులు పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరారు.

మహిళా సంఘాల అభివృద్ధికి కృషి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య

మొయినాబాద్ రూరల్, ఆగస్టు 30: అన్ని గ్రామాల మహిళా సంఘాలు అన్ని రంగాల్లో ఆదర్శంగా నిలవాలని, ప్రభుత్వం అన్ని విధాలుగా చేయూతనందిస్తుందని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయం ఆవరణలోని మహిళ సమాఖ్య భవనంలో 16వ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించగా ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం మహిళా సంఘాలకు అన్ని రకాలుగా ప్రోత్సాహాలను అందిస్తున్నట్లు చెప్పారు. ఎంపీడీవో సంధ్యరా జీ, పీఏసీఎస్ ఛైర్మన్ చంద్రారెడ్డి, ఏపీఎం రవీందర్, పీసీసీ కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి, షాబాద్ దర్శన్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు మాణయ్య, మహిళ సమాఖ్య సంఘం సభ్యులు తదితరులున్నారు.

దామర్లపల్లికి బస్సు సౌకర్యం కల్పించాలి

షాబాద్, ఆగస్టు 30 : మండల పరిధిలోని దామర్లపల్లికి బస్సు సౌకర్యం కల్పించాలని యువజన కాంగ్రెస్ చేవెళ్ల నియోజకవర్గం అధ్యక్షుడు పెంటారెడ్డి కోరారు. శుక్రవారం రాజేంద్రనగర్ డిపో మేనేజర్ బద్రీనారాయణకు వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ దామర్లపల్లికి బస్సు సౌకర్యంలేక విద్యార్థులు, ఉద్యోగస్థులు, గ్రామస్థులు ఇబ్బందులు పడుతున్నారని, గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించాలన్నారు. మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు బాలకృష్ణారెడ్డి, నాయకులు మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.



వినతి పత్రం అందజేస్తున్న పెంటారెడ్డి

అర్హులందరికీ రుణమాఫీ వర్తింపు

● జిల్లా వ్యవసాయాధికారి నర్సింహారావు

కొత్తూర్/షాద్‌నగర్ రూరల్, ఆగస్టు 30: రుణమాఫీ కాని రైతులు ఆందోళన చెందవద్దని.. త్వరలో అందరికీ వర్తిస్తుందని జిల్లా వ్యవసాయాధికారి నర్సింహారావు అన్నారు. మండల పరిధిలోని మల్లాపూర్‌లో కుటుంబసభ్యుల నిర్ధారణ కార్యక్రమాన్ని ఆయన పర్యవేక్షించారు. రుణమాఫీ కాని రైతులందరికీ మాఫీ చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. రుణమాఫీ రాని రైతుల వివరాలను యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నామని అన్నారు. షాద్‌నగర్ ఏడీఏ రాజారత్నం, కొత్తూర్ వ్యవసాయాధికారి గోపాల్‌నాయక్, ఏఈవోలు దీపిక, నిఖిత, గ్రామ మాజీ సర్పంచ్ సాయిలు, రైతులు పాల్గొన్నారు. అదేవిధంగా అర్హులైన ప్రతీ రైతుకు రుణమాఫీ జరుగుతుందని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జిల్లా వ్యవసాయాధికారి నర్సింహారావు తెలిపారు. ఫరూఖ్‌నగర్ మండలం కందివనం, చటాన్‌పల్లిలో కుటుంబ సభ్యుల నిర్ధారణ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో ఏడీ రాజారత్నం, ఏవో నిషాంత్ కుమార్, ఏఈవోలు తేజ్‌కుమార్, గోవర్ధన్, రాంబాబు, ప్రణీత, రైతులు పాల్గొన్నారు.



కొత్తూర్ : మల్లాపూర్‌లో రైతులతో మాట్లాడుతున్న డీఏవో నర్సింహారావు

రుణమాఫీ కొరకు ఇంటింటి సర్వే

ఆమనగల్లు/కడ్తాల్ : రుణమాఫీ కాని రైతులను గుర్తించి వారి వివరాలను సేకరించేందుకు మండల వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం కుటుంబ నిర్ధారణ సర్వే నిర్వహించారు. మండల పరిధిలోని ఆకుతోటపల్లి, శెట్టిపల్లి గ్రామాల్లో ఏవో శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో అధికారులు పర్యటించి సర్వే నిర్వహించారు. రుణ మాఫీకాని రైతుల వివరాలు సేకరించారు. సేకరించిన వివరాలను పోర్టల్‌లో నమోదు చేయడం జరుగుతుందని తెలిపారు. నేడు(శనివారం) మంగళపల్లి, చింతలపల్లిలో కుటుంబ నిర్ధారణ సర్వే నిర్వహించడం జరుగుతుందన్నారు. ఏఈవో భూదేవి, రైతులు పాల్గొన్నారు. కడ్తాల్ మండలం న్యామతాపూర్‌లో శుక్రవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతుల వివరాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏడీఏ ఆదిలక్ష్మి హాజరై ఏవో శ్రీలతతో కలిసి రైతుల వివరాలు సేకరించారు. ఏఈవోలు వందన, రమేశ్, కేథార్ సింగ్, అభినవ్, రైతులు తదితరులు పాల్గొన్నారు.



ఆమనగల్లు : ఆకుతోటపల్లిలో సర్వే నిర్వహిస్తున్న ఏవో శ్రీనివాస్‌గౌడ్

కార్మికుల సేవలు మరువలేనివి : వీర్లపల్లి

కొందుర్గు, ఆగస్టు, 30: లారీ కార్మికుల సేవలు మరువలేనివని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఉమ్మడి మండలాల లారీ ఆసోసియేషన్ కార్యాలయాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ ఏప్రాంతమైన అభివృద్ధి చెందాలన్నా రవాణా వనరులే కీలకమని అన్నారు. లారీ కార్మికులకు ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. అనంతరం లారీ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎండీ అబేద్, ఉపాధ్యక్షుడిగా మహమ్మద్ ఖలీల్, ప్రధాన కార్యదర్శిగా షర్పొద్దీన్, సంయుక్త కార్యదర్శిగా ఆసిఫ్, కోశాధికారిగా ఇబ్రహీం, కార్యవర్గ సభ్యులుగా నర్సింహులు, నజీం, షఫీలను ఎన్నుకున్నారు. లారీ ఓనర్స్ అసోసిచేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సయ్యద్‌సాధిక్, కొందుర్గు, చౌదరిగూడ మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కృష్ణారెడ్డి, రాజు, నాయకులు దామోదర్‌రెడ్డి, ఎండీ ఖాదర్‌ఘోరీ, జహంగీర్, యాదయ్య, పురుషోత్తంరెడ్డి, మంగులాల్ నాయక్, అంజిరెడ్డి, బి మాణయ్య, కె రామయ్యగౌడ్, ప్రవీణ్ గౌడ్, డి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

వెంకట్రామిరెడ్డి విగ్రహావిష్కరణకు సహకారం

షాద్‌నగర్ అర్బన్ : కుల మతాలకు అతీతంగా పేదలకు విద్యాదానం చేసిన సమర్థ పాలకుడు, సంఘ సంస్కర్త రాజాబహదూర్ వెంకట్రామిరెడ్డి విగ్రహాన్ని షాద్‌నగర్‌లో పెట్టాలని సంకల్పించడం అభినందనీయమని, తనవంతు సహాయ సహకారాలు ఉంటాయని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తెలిపారు. నిజాం పాలనతో తొలి తెలుగువాడుగా హైదరాబాద్ నగర పోలీసు కమీషనర్(కొత్వాల్)గా పనిచేసిన రాజా బహదూర్ వెంకట్‌రాంరెడ్డి విగ్రహాన్ని ప్రతిష్ఠించడానికి సహకారం అందించాలని శుక్రవారం మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి ఆధ్వర్యంలో స్థానిక రెడ్డి సంఘాల నాయకులు ఎమ్మెల్యేను కలిసి వినతి పత్రాన్ని ఇచ్చారు. స్థానిక మండల పరిషత్ ఎదుట ఉన్న ఇతర నేతల విగ్రహాల పక్కనే రాజా వెంకట్‌రాంరెడ్డి విగ్రహాన్ని ప్రతిష్ఠించడానికి పూర్తి సహకారం అందిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. అనంతరం స్థల పరిశీలన చేశారు. రెడ్డి సేవా సంఘాల నాయకులు కె. మదన్‌మోహన్‌రెడ్డి, చెంది మహేందర్‌రెడ్డి, ఎల్. మోహన్‌రెడ్డి, ఎం. నర్సింహ్మారెడ్డి, జి. శ్రీనివాస్‌రెడ్డి, అరుంధతిరెడ్డి, కె. పురుషోత్తంరెడ్డి, కృష్ణారెడ్డి, మధుకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



లారీ అసోసియేషన్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

నిజాలు నిర్భయంగా రాయండి

జర్నలిస్టులు నిజాలను నిర్భయంగా రాస్తూనే.. ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుకు సహకారం అందించాలని ఎమ్మెల్యే శంకర్ కోరారు. షాద్‌నగర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో స్థానిక ప్రింట్, ఎలక్ట్రానిక్ జర్నలిస్టులు ఎమ్మెల్యేను కలిశారు. షాద్‌నగర్‌లో గొలుసుకట్టుగా దుకాణాలలో జరిగిన దొంగతాలపై ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశానికి వెళ్లిన ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టుల పట్ల ఏసీపీ రంగస్వామి చులకన భావంతో అమర్యాదగా మాట్లాడారని జర్నలిస్టులు వివరించారు. యూట్యూబర్లు, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులందరు ఒక్కటేనని అవహేళన చేశారని ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. జరిగిన సంఘటనపై ఏసీపీతో మాట్లాడుతానని ఎమ్మెల్యే తెలిపారు. మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు.

శ్రావణ శుక్రవారం.. భక్తుల పూజలు

చేవెళ్ల, ఆగస్టు 30 : : శ్రావణ శుక్రవారం సందర్భంగా మండల కేంద్రంలోని కొనగట్టు శివాలయ క్షేత్రం, బ్రహ్మగిరి క్షేత్రంతోపాటు పలు దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. కొనగట్టు శివాలయంలోని భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామివారు, శ్రీ భ్రమరాంబ అమ్మవారు గాజులతో భక్తులకు దర్శనం ఇచ్చారు. మహిళలు పెద్దసంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని తమ మొక్కులు చెల్లించుకున్నారు.

వరలక్ష్మీ వ్రతాలు.. కుంకుమార్చనలు

ఆమనగల్లు/కడ్తాల్/యాచారం, ఆగస్టు 30 : శ్రావణ చివరి శుక్రవారం పురస్కరించుకొని వరలక్ష్మీ వ్రతాలను వైభవంగా నిర్వహించారు. వరలక్ష్మీ వ్రతాలు, కుంకుమార్చన కార్యక్రమాలు సంస్కృతి, సంప్రదాయాన్ని చాటాయి. కడ్తాల మండలం మైసిగండికి చెందిన పీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్‌పద్మశ్రీ దంపతుల ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు. ఆయన నివాసం వద్ద నిర్వహించిన వరలక్ష్మీ వ్రతంలో మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి బీక్యనాయక్, మాజీ జడ్పీటీసీ శ్రీపాతి శ్రీనివాస్‌రెడ్డి, పాల్గొన్నారు. కడ్తాల్ మండల కేంద్రంలోని శ్రీ సాయి మందిరంలో శుక్రవారం శ్రీలలితాపరమేశ్వరి దేవి విగ్రహ ప్రతిష్ఠ వేడుకలు వైభవంగా నిర్వహించారు. మూడు రోజుల వేడుకల్లో భాగంగా చివరిరోజు గంగు సచ్చిదానంద మూర్తి ఆధ్వర్యంలో ఎలికంటి జ్ఞాన ప్రసూనాంబ శర్మ పర్యవేక్షణలో శ్రీలలిత పరమేశ్వరి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాలు జరిగాయి. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. స్థానిక మాజీ సర్పంచ్ గూడూరి లక్ష్మీనర్సింహారెడ్డి, మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు మల్లప్ప, గూడూరు భాస్కర్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, సాయిరెడ్డి, జంగారెడ్డి, లీలా లక్ష్మారెడ్డి, పాలాది ఆంజనేయులు, రాఘవేందర్, నరేందర్‌రెడ్డి, ఆనంద్, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.యాచారం మండలంలోని నందివనపర్తి గ్రామంలోని శ్రీజ్ఞాన సరస్వతీ మాత ఆలయంలో చివరి శ్రావణ శుక్రవారం పురస్కరించుకొని ఉదయం 8గంటల నుంచి సాయంత్రం వరకు సరస్వతీ మాత ఆలయంలో పలు గ్రామాలకు చెందిన మహిళలు సామూహిక వరలక్ష్మీ వ్రతం చేశారు. ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు, సామూహిక వరలక్ష్మి వ్రతాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో అమ్మవారి నామస్మరణతో మారుమోగింది.



ఆమనగల్లు : పూజల్లో పాల్గొన్న భక్తులు

దైవ కార్యక్రమాల్లో పాలు పంచుకోవాలి

దైవ కార్యక్రమాల్లో ప్రతీ ఒక్కరు పాలు పంచుకోవాలని మాజీ వైస్ ఎంపీపీ జక్కు అనంతరెడ్డి కోరారు. ఆమనగల్లు మండలం మంగళపల్లి పోచమ్మ, మైసమ్మ ఆలయాల వద్ద శుక్రవారం నిర్వహించిన పూజల్లో అనంత రెడ్డి పాల్గొని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా బోనాల వేడుకలకు రూ.15,116 లు అనంత రెడ్డి నిర్వాహకులకు విరాళం అందజేశారు. మాజీ సర్పంచ్ జంగయ్య, చంద్రమౌళి, తదితరులు ఉన్నారు.

సంక్షిప్తంగా..

తలకొండపల్లి : సామాజిక సేవా కార్యక్రమాల్లో రెడ్డి సేవా సమితి సభ్యులు ముందుండాలని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పిలుపునిచ్చారు. రాంపూర్ గ్రామంలో రెడ్డి సేవా సమితి అధ్యక్షులు చిన్న హరి మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో రూ. 20 లక్షలతో నూతనంగా నిర్మించిన రెడ్డి సేవా సమితి భవన్‌ను శుక్రవారం కల్వకుర్తి నియోజకవర్గ రెడ్డి సేవా సమితి అధ్యక్షులు శేఖర్‌రెడ్డి, మండల రెడ్డి సేవా సమితి , కాంగ్రెస్ అధ్యక్షులు ప్రభాకర్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ నాయకుడు కాసు శ్రీనివాస్ రెడ్డి, స్థల దాత హరి మోహన్ రెడ్డి, డి.మోహన్‌రెడ్డి, మాజీ సర్పంచ్ శ్యామ్‌సుందర్‌రెడ్డిలతో కలిసి ప్రారంభించారు.

కేశంపేట : సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో రవిచంద్రకుమార్ రెడ్డి సూచించారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో పంచాయతీ కార్యదర్శులు, గ్రామ పత్యేకాధికారులతో సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో పారిశుధ్య చర్యలు చేపట్టాలన్నారు.

ఆమనగల్లు : ఆమనగల్లు పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో బాలసభ నిర్వహించారు. వందేమాతరం ఫౌండేషన్ అండ్ అక్షర జ్యోతి ఆధ్వర్యంలో నిర్వహించిన బాలసభలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

తలకొండపల్లి : ఎస్సీ రిజర్వేషన్ పరిరక్షణ సమితి 14వ ఆవిర్భావ దినోత్సవాలను మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి ప్రజలకు పంచిపెట్టారు. ఎస్సీ రిజర్వేషన్ పరిరక్షణ సమితి వ్యవస్థాపక జాతీయ అద్యక్షులు కర్నె శ్రీశైలం చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న రోగులు, వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు.

తలకొండపల్లి : మండల పరిధిలోని దేవుని పడకల్‌లో పాడైన రోడ్లను అదే గ్రామానికి చెందిన వాలిబాల్ యూత్ అధ్యక్షుడు కానుగుల మల్లేశ్ సొంత డబ్బుతో మరమ్మతులు చేయించాడు. దేవునిపడకల్ నుంచి పెద్ద చెరువు కల్వర్టు మీదుగా రామన్న కుంట వరకు రెండు కిలోమీటర్ల రోడ్డు, శ్మశానవాటికను కలిపే రోడ్డులను రూ.4లక్షలతో మొరం పోయించి డోజర్లతో చదును చేయించాడు. రోడ్డు మధ్యలో కల్వర్టు నిర్మాణం చేయించాడు. మాజీ సర్పంచ్ శ్రీశైలం, మాజీ ఉపసర్పంచ్ తిరుపతి, రోడ్డు నిర్మాణం చేపట్టిన మల్లేశ్‌లతో కలిసి బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు శంకర్ ప్రారంభించారు.

షాబాద్ : పండుగలను ప్రజలు ప్రశాంతంగా జరుపుకోవాలని షాబాద్ ఇన్‌స్పెక్టర్ కాంతారెడ్డి అన్నారు. షాబాద్ పోలీస్ స్టేషన్ ఆవరణలో వినాయకచవితి ఉత్సవాలు ప్రశాంతంగా జరుపుకోవాలని మాజీప్రజాప్రతినిధులు, ప్రజలకు అవగాహన సదస్సును నిర్వహించారు. ఎస్ఐ మహేశ్వర్‌రెడ్డి, ఏఈ నరేందర్, గ్రామాల మాజీసర్పంచులు, మాజీఎంపీటీసీలు, ఉత్సవకమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మొయినాబాద్ రూరల్ : హిమాయత్ నగర్ గ్రామంలో నిర్వహించిన వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. హిమాయత్ నగర్ గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో చైతన్య డీమ్డ్ యూనివర్సిటీలోని అలైడ్ హెల్త్ సైన్స్ విభాగం, బయో కెమిస్ట్రీ విభాగానికి సంబంధించిన విద్యార్థులు ఉచిత ఫిజియోథెరపీ, ఉచిత రక్త పరీక్షల వైద్య శిబిరాన్ని శుక్రవారం ఏర్పాటు చేయగా గ్రామ పంచాయతీ కార్యదర్శి సంధ్యరాణి, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ముదిగొండ రవియాదవ్‌లు ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు.

కందుకూరు : సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా నేడు(శనివారం) విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ రమేష్ తెలిపారు. దెబ్బడగూడ, మకాన్ ఫీడర్‌ల పరిధిలో లైన్ షిఫ్టింగ్‌పనుల కారణంగా ఉదయం పదిన్నర గంటల నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు, నేదునూర్‌లోని 11 కేవీ ఫీడర్‌లో మరమ్మతుల కారణంగా మన్నెగూడ, అలీఖాన్‌పల్లి గ్రామాలలో, సరస్వతీగూడ, లేమూరు ఫీడర్‌లలో మరమ్మత్తుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు చెప్పారు. మధ్యాహ్నం ఒంటిగంట నుంచి సాయంత్రం 4వరకు సరఫరా నిలిపివేస్తున్నట్లు చెప్పారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఇబ్రహీంపట్నం : తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర స్థాయి తరగతులు నేటి (శనివారం) నుంచి మూడు రోజులపాటు నిర్వహిస్తున్నట్లు రైతు సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు ఎం.రామకృష్ణారెడ్డి, సీ.హెచ్.మునలయ్యలు తెలిపారు. మంగల్‌పల్లి దగ్గర శుభం కన్వెన్షన్‌లో తరగతులు ఉంటాయని సెప్టెంబరు ఒకటిన జరిగే రైతు సదస్సులో అఖిల భారత రైతు సంఘం ప్రధాన కార్యదర్శి విజ్జు కృష్ణ, రాష్ట్ర కార్యదర్శి సాగర్‌లు పాల్గొంటారన్నారు.

షాద్‌నగర్‌అర్బన్ : కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలోనే అన్ని మతాలకు సమాన గౌరవం లభిస్తుందని రాష్ట్ర క్రిస్టియన్ ఫైనాన్షియల్ కార్పొరేషన్ చైర్మన్ దీపక్ జాన్ అన్నారు. షాద్‌నగర్ గుడ్ షెపర్డ్ కమ్యూనిటీ చర్చిలో శుక్రవారం నిర్వహించిన పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సమావేశానికి హాజరై మాట్లాడారు. మణిపూర్‌లో జరిగిన ఘటనపై రాహుల్‌గాంధీ మాత్రమే అక్కడికి వెళ్లి, క్రిస్టియన్లపై జరిగిన దాడిపై మాట్లాడారని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సైతం క్రిస్టియన్ల సంక్షేమం కోసం ప్రాధాన్యతనిస్తున్నారని అన్నారు.

షాద్‌నగర్‌అర్బన్ : షాద్‌నగర్ స్టేడియంలో నిర్వహించిన పాఠశాల స్థాయి ఫ్రీడం కప్ క్రికెట్ టోర్నమెంట్ శుక్రవారం ముగిసింది. ఎస్‌జీఎఫ్ షాద్‌నగర్ జోనల్ కార్యదర్శి ఎ.రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీలో 28 జట్లు పాల్గొన్నాయి. ఫైనల్ మ్యాచ్‌లో షాద్‌నగర్ జిల్లా పరిషత్ ఉన్నత (కుంటబడి) పాఠశాల జట్టు విజయం సాధించింది. హెచ్ఎం భాగమ్మ ట్రోఫీ ఇచ్చి, అభినందించారు. రెండవ బహుమతిని కేశంపేట వశిష్ఠ పాఠశాల విద్యార్థులు గెలుసుకున్నారు. పీడీ బాలయ్య, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కొత్తూర్ : బీజేపీ యువమోర్చా ఓబీసీ మండల శాఖ అధ్యక్షుడిగా మండలంలోని సిద్ధాపూర్ గ్రామానికి చెందిన బైరమోని నర్సింహ, కిసాన్‌మోర్చా మండలాధ్యక్షుడిగా మధుసూదన్‌ను బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు మంగలి రమేష్ అధ్యక్షతన మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో ఎన్నుకున్నారు. నూతనకమిటీల అధ్యక్షులను బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు అందెబాబయ్య శాలువలతో సన్మానించారు. బీజేపీ జిల్లా ప్రధానకార్యదర్శి దేపల్లి ఆశోక్‌గౌడ్, నాయకులు రణధీర్‌గౌడ్, అంబటి శ్రీశైలం, బావండ్ల మాణిక్యం తదితరులున్నారు.

ఇబ్రహీంపట్నం : సెప్టెంబరు 7 నుంచి నిర్వహించ తలపెట్టిన గణేష్ నవరాత్రోత్సవాలను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని మహేశ్వరం డీసీపీ సునీతారెడ్డి అన్నారు. రహదారులపై మంటపాలను ఏర్పాటు చేయవద్దని అలాగే విద్యా సంస్థలు, ఆసుపత్రుల దగ్గర కూడా మంటపాలు ఏర్పాటు చేయరాదన్నారు. ఇబ్రహీంపట్నంలోని శాస్త్రా గార్డెన్స్‌లో గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులతో జరిగిన సమావేశంలో ఏసీపీ కేపీవీ రాజుతో కలిసి పాల్గొన్నారు. వీలైనంత వరకు ఒకే రోజు నిమజ్జనం జరిగేట్లు చూడాలన్నారు. నిమజ్జనం జరిపే శేరిగూడ చెక్ డ్యాంను పరిశీలించారు. చైర్ పర్సన్ స్రవంతి, తదితరులున్నారు. రామోజీ ఫిలిం సిటీ ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నం టౌన్‌లో ఏర్పాటు చేసిన రూ.15 లక్షల విలువచేసే 50 సీసీ కెమెరాలను ఇక్కడ పోలీస్‌స్టేషన్‌లో ఆమె ప్రారంభించారు.

ఆమనగల్లు : ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని లయన్స్‌క్లబ్ జిల్లా వైస్ గవర్నర్ జి.మహేంద్ర కుమార్‌రెడ్డి అన్నారు. ఆమనగల్లు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో కందూరులో మెగా వైద్యశిబిరం నిర్వహించారు. లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, ఎనుగొండ రాంరెడ్డి లయన్స్ కంటి ఆసుపత్రి చైర్మన్ డాక్టర్ వి. దామోదర్ రెడ్డి, డైరెక్టర్ బాలకృష్ణారెడ్డి, సుకుమార్ లతో శిబిరాన్ని మహేంద్రకుమార్‌రెడ్డి ప్రారంభించారు.

క్రైం కార్నర్

ఆర్టీసీ బస్సు ఢీకొని వృద్ధురాలు దుర్మరణం

● డ్రైవర్ నిర్లక్ష్యమే కారణం

కొత్తూర్, ఆగస్టు 30 : ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో ఓ వృద్ధురాలు దుర్మరణం చెందారు. మండల కేంద్రానికి సమీపంలో గల నాట్కో జంక్షన్ వద్ద 44వ నెంబర్ జాతీయ రహదారిపై శుక్రవారం తెల్లవారుజామున ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో జహంగీర్‌బీ(60) అనే వృద్ధురాలు మృతి చెందినట్లు ఇన్‌స్పెక్టర్ నర్సింహారావు తెలిపారు. కొత్తూర్‌కు చెందిన జహంగీర్‌బీ నాట్కో జంక్షన్ వద్ద గల ఓ టిఫిన్ సెంటర్‌లో కూలీగా పనిచేస్తుందని తెలిపారు. రోజూ మాదిరిగానే కొత్తూర్ నుంచి వస్తూ నాట్కో జంక్షన్ దాటుతుండగా, హైదరాబాద్ నుంచి రాయిచూర్ వెళ్తున్న బస్సును డ్రైవర్ అజాగ్రత్తగా, అతివేగంగా నడుపుకుంటూ వచ్చి జహంగీర్‌బీని ఢీకొట్టి డివైడర్ వైపు దూసుకపోయి నిలిచిపోయిందని తెలిపారు. దాంతో జహంగీర్‌బీ అక్కడికక్కడే దుర్మరణ చెందింది. మృతదేహాన్ని షాద్‌నగర్ కమ్యూనిటీ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. మృతురాలు జహంగీర్‌బీ కుమారుడు బురాన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ నర్సింహారావు తెలిపారు.

లారీ-కారు ఢీ.. వ్యక్తి మృతి



అశోక్(ఫైల్)

చెవేళ్ల, ఆగస్టు 30: ముందు వెళ్తున్న వాహనాన్ని ఓవర్‌టేక్ చేయబోతుండగా ఎదురుగా వస్తున్న లారీని కారు ఢీకొట్టడంతో.. కారులో ఉన్న విద్యుత్ లైన్‌మన్ అశోక్ (40) అక్కడికక్కడే మృతి చెందాడు. ఈసంఘటన చెవేళ్ల పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఇబ్రహీంపల్లి బస్‌స్టేజీ సమీపంలో శుక్రవారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం... మొయినాబాద్ మండలంలోని కనకమామిడి గ్రామానికి చెందిన అశోక్ వికారాబాద్ జిల్లాలోని తాండూర్‌లో లైన్‌మ్యాన్‌గా పనిచేస్తున్నాడు. శుక్రవారం సాయంత్రం ఇంటి నుంచి విధులకు తాండూరుకు వెళ్తున్నాడు. ఈక్రమంలో చెవేళ్ల మండలం ఇబ్రహీంపట్నం బస్‌స్టేజీ వద్ద ఎదురుగా వస్తున్న లారీని కారు ఓవర్‌టేక్ చేయబోయి ఎదురుగా వస్తున్న లారీని ఢీకొంది. దాంతో అశోక్ అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. వారు సంఘటనా స్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతిడికి భార్య ప్రమీల ఇద్దరు కొడుకులు ఉన్నారు.

ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య

యాచారం, ఆగస్టు 30 : ఇప్పటికి రెండుసార్లు విషం తాగి ఆత్మహత్యకు యత్నించి విఫలమైన ఓ రైతు గురువారం సాయంత్రం తన వ్యవసాయ పొలంలో చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన వెలుగు చూసింది. యాచారం పోలీస్ స్టేషన్ పరిధిలోని తమ్మలోనిగూడ గ్రామానికి చెందిన కర్రె మదారి(50)కి భార్య బౌగురమ్మ, కుమారులు శ్రీకాంత్, మల్లేష్, కుమార్తె శ్రీలత ఉన్నారు. కొంత కాలంగా మదారి మానసికంగా ఇబ్బందులు పడుతున్నాడు. దాంతో గతంలో రెండు సార్లు విషం తాగి ఆత్మహత్యకు యత్నించడంతో కుమారులు చికిత్స చేయించి ప్రాణాలు కాపాడారు. గురువారం తక్కళ్లపల్లి శివారులోని తన వ్యవసాయ పొలంలో చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. అయితే, శవం కిందపడిపోయింది. కుటుంబ సభ్యులు యాచారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై మధు శుక్రవారం ఇబ్రహీంపట్నం మార్చురీలో శవ పరీక్ష చేయించారు. ఎందుకు ఆత్మహత్య చేసుకున్నాడో కారణాలు తెలియరాలేదు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మృతదేహం వెలికితీసి పోస్టుమార్టం

నందిగామ, ఆగస్టు 30 : ఖననం చేసిన మృతదేహానికి పోస్టుమార్టం చేసిన ఘటన నందిగామ పోలీస్‌స్టేషన్ పరిధిలోని చేగూర్‌లో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని చేగూర్ గ్రామానికి చెందిన మల్లపురం నర్సింహ హైదరాబాద్‌లో ప్రైవేట్ ఉద్యోగం చేస్తూ కుటుంబ సభ్యులతో కలసి నివాసముంటున్నాడు. ఆయన కూతురు తారా చంద్రిక(18) ఇంటర్ సెకండియర్ చదువుతోంది. ఈ నెల 18న చంద్రిక ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకొని చనిపోయింది. కుటుంబ సభ్యులు గుట్టుచప్పుడు కాకుండా చేగూర్‌లో అంత్యక్రియలు నిర్వహించారు. అనంతరం ఆమె మొబైల్‌కు తరచూ ఓ యువకుడి నెంబర్ నుంచి కాల్స్ రావడంతో పాటు మెసేజ్‌లు పంపడం కుటుంబ సభ్యులు గమనించారు. అనుమానం వచ్చిన చంద్రిక తండ్రి నర్సింహ ఆ యువకుడి వేధింపులు తట్టుకోలేకనే తన కూతురు ఆత్మహత్యకు పాల్పడిందని షైలార్‌దేవ్‌పల్లి పోలిసులకు ఫిర్యాదు చేశాడు. సెక్షన్ 306 కింద కేసు నమోదు చేసుకున్న పోలీసులు గురువారం అంత్యక్రియలు జరిగిన చోటే మృతదేహానికి డాక్టర్లు, తహసీల్దార్ రాజేశ్వర్ ఆధ్వర్యంలో పోస్టుమార్టం నిర్వహించారు.

కిరాణా షాపులో చోరీ.. రూ.35వేలు అపహరణ

కేశంపేట, ఆగస్టు 30: మండల పరిధిలోని కొనాయపల్లి గ్రామంలో ఉన్న ఓ కిరాణా షాపులో చోరీ జరిగింది. షాపులో ఉన్న రూ.35వేలను గుర్తుతెలియని దొంగలు అపహరించారు. ఎస్సై రాజ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. కొనాయపల్లి సమీపంలో సొప్పరి నర్సింహకు కిరాణ షాపు ఉంది. కుటుంబ సభ్యులతో కలిసి గురువారం సాయంత్రం బంధువుల ఇంటికి వెళ్లాడు. అదే రోజు రాత్రి గుర్తుతెలియని దొంగలు కిరాణ షాపులోకి దూరి, షాపులో ఉన్న రూ. 35వేల ఎత్తుకెళ్లారు. శుక్రవారం నర్సింహ ఫిర్యాదు చేయగా దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

వేర్వేరు చోట్ల ఇద్దరు అదృశ్యం

● భర్తతో గొడవపడి మహిళ



మంజుల

కేశంపేట, ఆగస్టు 30 : భర్తతో గొడవ పడి ఇంట్లో నుంచి వెళ్లిన ఓ మహిళ అదృశ్యమైన ఘటన మండలంలోని చౌలపల్లిలో చోటుచేసుకుంది. ఎస్సై రాజ్‌కుమార్ వివరాల ప్రకారం గ్రామానికి చెందిన చౌడమోని కృష్ణయ్య, మంజుల భార్యాభర్తలు, కుటుంబ విషయాల్లో తరచూ గొడవ పడుతుండేవారు. భర్తతో గొడవ పడి ఇంట్లో నుంచి వెళ్లి తిరిగి వచ్చేది.. ఈ క్రమంలో ఆగస్టు 26న వారి మధ్య గొడవ జరిగింది. ఇంట్లో నుంచి వెళ్లిన భార్య తిరిగి రాలేదు. బంధువుల ఇళ్ల వద్ద వెతికినా ఫలితం లేకపోయింది. మంజుల ఇంట్లో నుంచి వెళ్లే సమయంలో పసుపు చీర, పసుపు జాకెట్ ధరించిందని, చామన ఛాయ, గుండ్రని ముఖం కలిగి ఉంటుందని తెలిపారు. ఆచూకీ తెలిస్తే ఎస్సై ఫోన్ నెంబర్ 9440904759 కు సమాచారం ఇవ్వాలని కోరారు. శుక్రవారం మంజుల తమ్ముడు కొంగరి శ్రీశైలం తన అక్క అదృశ్యమైందని ఫిర్యాదు చేశాడు.

శంషాబాద్‌లో ఏడాది బాలుడు..

శంషాబాద్, ఆగస్టు 30 : శంషాబాద్ మున్సిపల్ కేంద్రంలో ఏడాది బాలుడు అదృశ్యమయ్యాడు. ఈ ఘటన శంషాబాద్ ఆర్జీఐఏ పోలీస్‌స్టేషన్ వెనుకాల ఉండే గుడిసెల్లో శుక్రవారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. శంషాబాద్ ఆర్జీఐఏ పోలీస్‌స్టేషన్ వెనుకాల ఉన్న ఖాళీ స్థలంలో గుడిసెల్లో నివాసముంటున్న మురళి-స్వాతి దంపతులకు కుమారుడు ఏడాది వయసున్న ఈశ్వర్ ఉన్నాడు. రాత్రి అతడిని వారి ఇద్దరి మధ్యలో పడుకోబెట్టుకొని నిద్రకుపక్రమించారు. తెల్లారి లేచిచూసేసరికి బాలుడు కనిపించలేదు. దాంతో చుట్టుపక్కల వెతికినా జాడతెలియలేదు. పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి రెండు బృందాలను ఏర్పాటు చేసి గాలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ప్రేమ పేరుతో మోసం.. వ్యక్తికి జీవితఖైదు

● రూ.25వేల జరిమానా.. బాధితురాలికి రూ.5 లక్షల పరిహారం

కందుకూరు, ఆగస్టు 30 : ప్రేమ పేరుతో ఓ బాలికను మోసం చేసిన వ్యక్తికి జీవితఖైదుతో పాటు రూ.25వేల జరిమానా విధించి, బాధితురాలికి రూ.5 లక్షల పరిహారం అందించేలా రంగారెడ్డి జిల్లా ఫాస్ట్‌ట్రాక్ కోర్టు శుక్రవారం తీర్పు వెలువరించింది. కందుకూరు పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ బాలికను వనపర్తి జిల్లా కొత్తకోట మండలంలోని కన్నాయిపల్లి గ్రామానికి చెందిన ఇరుగదిండ్ల శివాజీ (20) ప్రేమ పేరుతో మోసం చేసిన కేసులో 2017లో క్రైం నెంబర్ 35 ప్రకారంగా కేసు నమోదు చేశారు. కాగా, ఇతనిపై కందుకూరు పోలీసులు సమగ్రంగా విచారణ చేసి సెక్షన్లు 363, 366, 417, 376, 493తో పాటు సెక్షన్ 3(1)(డబ్ల్యూ) ఎస్సీ, ఎస్టీ చట్టం సెక్షన్ 4 ఆఫ్ పోక్సో చట్టం.. ఎస్సీ 399/2018 హత్యాచార చట్టం కింద కేసు నమోదు చేసి కోర్టులో చార్జిషీట్ వేశారు. ఈ కేసు వివరాలను పూర్తిగా విచారణ చేసిన న్యాయాధికారి శుక్రవారం నిందితుడికి జీవితఖైదుతో పాటు రూ.25వేల జరిమానా విధించారు. బాధితురాలికి ప్రభుత్వం రూ.5లక్షల పరిహారం ఇవ్వాలని తీర్పు వెల్లడించారు.